**"బాస్ వచ్చే టైం అయింది. సీటుకు పోతా, బ్రదర్!" అన్నాడు ప్రభాకర్ కుర్చీలోంచి లేస్తూ, "బాస్ కాదు. బాసినీ. అమెండ్‌మెంట్ గుర్తు పెట్టుకో ప్రభాకర్! ఏ మోడల్ మీద అయినా మంచి చీర ఒకటి కనిపిస్తే చాలు, గంటలేటుగా రావడం మామూలేగా ఆవిడకు. అప్పుడే ఎక్కడ వస్తుంది?" అన్నాడు దాసు, దమ్ము లాగుతూ.**




"ఉష్! ఇక్కడ గోడలకు చెవులు ఉన్నాయని తెలుసుగా? మరిచిపోతావేం? పొద్దునే బాస్తిలో కిర్‌కిర్ నాకూ, నా ఆరోగ్యానికీ మంచిది కాదు," అంటూ ప్రభాకర్ ఆ గది లోంచి బయటకు వచ్చాడు.

వరండాలోకి వానతుంపర పడుతోంది. కాని, అటూ ఇటూ ఆకాశం కేసి చూస్తే, పెద్దగా వచ్చే లక్షణాలు ఏమీ కనబడటంలేదు, మబ్బులు తప్ప. వరండాలో నడుస్తూ, గ్రిల్ రంధ్రాలలోకి వేళ్లు పోనిచ్చి ఒక క్షణం ప్రభాకర్ నిలబడ్డాడు, బయట జామచెట్టు మీద దోరకాయలు ఏమైనా ఉన్నాయేమో చూద్దామని. చూస్తూ చూస్తూ, "అమ్మో! పాము, పాము!" అని వెర్రి కేక పెట్టాడు. వెనక్కి పారిపోబోతే అతని వేళ్లను ఆ గ్రిల్ విడిచి పెడితేగా! వేళ్లు గీరుకుపోయాయి.

ఆ కేక విని, దాసు పరుగెత్తుకువచ్చాడు. పొగలు కక్కే ముక్కులతో, సిగరెటు ఏమైపోయిందో దానుకి కూడా తెలియదు. స్వీపరు సూరమ్మ ఉరుక్కుంటూ వచ్చింది. సూపరెంటు- అదే సూపరెంటెండెంట్ నెమ్మదిగా వచ్చాడు, ఎడమ చేతి వేళ్లతో షర్టు జేబును పట్టుకొని, కుడి చేత్తో ధోవతి గోచీ సర్దుకుంటూ, కళ్లజోడు ముక్కు మీదికి కొంచెం జారినా పట్టించుకోకుండా.

జామకొమ్మ వెంబడి పడుకొని ఉంది నాగుపాము. ఆ కొమ్మరంగూ, దాని రంగూ ఒకటే" అదుగో పాము!" అని దాసు అంటే, కళ్ళు పెద్దవి చేస్తూ, కళ్లజోడు సవరించుకుంటూ, నడుం పట్టుకొని, "ఏదీ? ఎక్కడ?" అని సూపరెంటు అడుగుతుంటే, ప్రభాకర్‌కు వళ్లు మండిపోయింది. "ఇదేమీ ఫైల్ కాదు, పేజీ నెంబర్లు ఎక్కడ, పేరా నెంబర్లు ఎక్కడ, అని అడగటానికి. బారన్నరపాము, నాగుపాము. అమ్మో! అదేం?" అంటూ, ప్రభాకర్ ఆఫీసరు గదివైపుకు పరుగెత్తాడు. స్పష్టంగా వినవడకపోయినా, ఏదో ఆర్తనాదం మాత్రం వినిపించినట్లై, అటే వస్తున్న ఆఫీసరు మేడం, అతనికి గుమ్మంలోనే ఎదురైంది.

ప్రభాకర్ లేచిన వేళ మంచిది. ఆమెను ఢీ కొట్టేసేవాడే కాని, ఎనిమిది, పోనీ పది అంగుళాల దూరంలో అతని కాళ్ళకి కళ్లు సడెన్ బ్రేక్ వేశాయి. లేకపోతే ఉద్యోగం కాస్తా ఊడిపోను. "మే..మే.. మేడం! పా... పా... పాము" అంటూ చేత్తో ప్రభాకర్ చెట్టుకేసి, చూపించబోయాడు. ఆమె అక్కడ ఉంటేగా చూడటానికి! ప్రభాకర్ చేయి ఎత్తే లోపలే ఆమె తన రూంలోకి వెళ్లిపోవడం, రెండు కాళ్ళూ కుర్చీలో పెట్టుకొని కూచోవడం జరిగిపోయింది. కాని ప్రభాకర్ అంతటితో ఊరుకుంటేనా? అడుగులో అడుగు వేసుకుంటూ, ఆఫీసరు రూంలోకి ప్రవేశించాడు మళ్ళీ. ఆమె ఇంటరులో బ్రహ్మాండంగా బయాలజీ డిసెక్షన్‌లు చేసినట్లు ఒకసారి చెప్పుకొన్న గొప్పలు గుర్తుకు వచ్చాయి అతనికి. "మేడం! దగ్గరగా వచ్చి చూసి, అది ఏ రకం పామో చెప్తారా మాడం!" అన్నాడు వినయం ఉట్టిపడుతూ అతని మాటలు వినిపించే స్థితిలో లేదామె.

పొద్దునే చేసుకున్న ఫేస్ మేకప్ అంతా పోయినా సరేనని, తన చెమటలన్నీ రుమాలుతో గబగబ తుడుచుకుంటోంది. పైగా రుసరుసలు. పోవయ్యా! నాకెట్లా తెలుస్తుంది? ఐ సే లీవ్ మీ ఎలోన్!" అని కసిరింది.

ఆఫీసరు రూంలోంచి ప్రభాకర్ బయటకు వచ్చాడు ఒక్క గంతుతో. సూపరెంటూ, దానూ, అంతా కలిసి, పామును జామ చెట్టుమీద ఒంటరిగా వదిలేసి, ఆఫీసరు రూం దగ్గరికి వస్తూ ఉన్నారు. "ఆగండి, అక్కడే!" అన్నట్లు ప్రభాకర్ సంజ్ఞచేసి, ఒక పక్కనవ్వు ఆపుకుంటూ, మరో పక్క దడదడలాడిపోతూ, వాళ్లని కలుసుకున్నాడు. పై నుంచి కిందికి ఫైలు అంతా చిటికలో చదివేసినట్లు, అంతలోనే ప్రభాకర్‌ను దాసు అర్థం చేసుకున్నాడు.

స్వీపర్ సూరమ్మ, "ఏమిటి సారూ! ఏమిటావరేషాన్? ఇంత మంది మగాళ్ళు ఉన్నారు, ఒక్క పామును చంపలేరూ?" అని అడిగింది, ఎడమబొటన వేలుకు, చూపుడువేలుకు మధ్య బుగ్గలు నొక్కుకుంటూ.. సూపరెంటు, "అమ్మమ్మ! ఎంత మాట సూరమ్మ! ఆఫీసుకు వచ్చిన పామును మనం చంపకూడదు." అని రూలింగు ఇచ్చాడు. "ఏం? మీ రూల్సు ఒప్పుకోవా, సారూ?" అని తలతిప్పేసి, వెళ్లిపోయింది. రికార్డు రూం వైపు చీపురు పుచ్చుకొని.

దాసు నెమ్మదిగా "సూపర్‌గారూ, సూరమ్మ మాటలలో రెండు మంచి పాయింట్లు కనిపిస్తున్నాయి" అని ఒక చిన్న సర్టిఫికెటు లాంటిది విసిరాడు. తనను సూపర్ అనిపిలిస్తే ఆయన సూపర్ మాన్‌లా ఫీల్ అవుతాడు. కాని, ఈ వేళ తన కళ్ల జోడు అద్దాలపై నుంచి చూశాడు ఆయన దాస్‌కేసి, ఆ చూపు డేంజర్ సిగ్నల్! దాస్ కంగారు పడ్డాడు. "మరేం, లేదా సార్! నేను మగాణ్ణే కదా మరి! రూల్స్ ఒక సారి మీరు చూస్తే.... నేను......". "ఏమిటీ! పామును - అందులోనూ ఆఫీసుకు వచ్చిన పామును నువ్వు ..... అంటే టి.జి.కె.బి. దాసు అనే నువ్వు... చంపుతావా? వీల్లేదు. ముమ్మాటికి వీల్లేదు." అని తల అడ్డంగా తిప్పేశాడు, గాలికి స్ప్రింగ్ బొమ్మ తల తిరిగిపోయినట్లు, ఒకసారి జామచెట్టు వైపు దృష్టి సారించి. చేయి అడ్డుపెట్టుకొని, వేళ్ల సందుల్లలోంచి ఆ నాగు పామును ప్రభాకర్ చూసీ చూడనట్టు చూశాడు. అది ఆ కొమ్మ మీద నిశ్చింతగా పడుకొని ఉంది, మధ్య మధ్య నాలుకలు చూపిస్తూ.



'మీకు వ్యతిరేకంగా నడిచిన మంత్రులు ఇద్దరైతే ముగ్గుర్ని బర్తరఫ్ చేశారెందుకు? ప్రశ్నించాడు విలేఖరి.

'అవునయ్యా! నా లక్కీ నెంబరు మూడే మరి'. బదులిచ్చాడు ముఖ్యమంత్రి.

— ధనలక్ష్మి
సికింద్రాబాద్

నడెన్‌గా ఏం గుర్తు వచ్చిందో ఏమో, సూపరెంటు ఫోన్ దగ్గరకు క్షణంలో పరుగెత్తాడు. దాసు, ప్రభాకర్ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. సూపర్‌ఫోన్ అర్థం కాక, కొంపతీసి పోలీస్‌కు ఫోను చేస్తున్నాడా అని అనుమానం వచ్చింది ప్రభాకర్‌కి, నాగు పాముల్ని ఎర్ర చీమల్ని చంపడానికి ఉన్నారా పోలీసులు - అని అనుకొని, నాలుక కొరుక్కొని, ఎడమ చేతితో తన తల మీద తానే జెల్లకాల ఒకటి అందుకొన్నాడు. దాసుకు ఏమీ అర్థం కావడం లేదు. పది రూపాయలు ఇస్తే, ఆ పక్క పని చేస్తున్న పనివాడు ఎవరైనా వచ్చి ఆ పామును చంపేస్తాడు కదా!" అని గొణిగాడు దాసు. "రూల్స్ ఒప్పుకోవుగా." అని ప్రభాకర్ నీళ్లు నమిలాడు. కాని దాసు ఊరుకుంటేనా? పెద్ద వీధిలో ఉన్న మన పెద్ద బాస్ దగ్గర ఆర్డర్స్ తీసుకుంటే సరి" అని మళ్లీ అందుకున్నాడు. "అయితే ఇంకేం, ఫైల్ రాసి సూపర్‌కి పెట్టు. ఈలోగా నేను టాయిలెట్‌కి....." అని ప్రభాకర్ సగంలో ఆగిపోయాడు. ఆ జామ చెట్టుకు దగ్గరలోనే టాయిలెట్ ఉందని గుర్తు వచ్చి.

గదులు తుడవడం పూర్తి చేసుకుని, చీపురు మూలపడేసి, సూరమ్మ "సారూ! మంచినీళ్లు తేవడానికి నేనుపోతున్నా" అంది, కూజా తీసుకొని రెండు చేతులతో పట్టుకొని కుదుపుతూ. తిరిగి సీటులో కూచుంటూ సూపరెంటు "ఒక గుక్కెడు ఇటు పోసి, మిగిలినవి వంచెయ్, సూరమ్మ తల్లీ" అన్నాడు. "నిన్నటి నీళ్లు కదయ్యా, తాజా నీళ్లు ఇప్పుడే తెస్తాలే", అంది. ఆమె, ఆ నీరు వంచేసింది. సింకులో. 'నువ్వు నీళ్లు తెచ్చేలోగా మన సూపర్ గారూ.... '' అని ఆయన కేసి చూశాడు; సూపర్‌కు వళ్లు మండింది. "నిన్ను..... నిన్ను...... ఆ నాగు పాముకు కప్పును వేసినట్టు వేసేస్తా, జాగ్రత్త! - వేధవ జోకులు వేశావంటే!" అని అరిచాడు. ఇంతలోకే ఆఫీసరమ్మ రూం లోంచి కాలింగ్ బెల్ మోగింది. ఆ బెల్‌కు అదో సరదా!

సూపరెంటు గరుగెత్తాడు, ఆమె రూంలోకి. గుమ్మందాకా దాసు వెళ్ళి పోయి, సూపర్ నెత్తిమీద కూచున్నాయి, ఆయన కళ్లజోడులా.

"నేను పది నిమిషాలలో మీటింగుకు వెళ్లాలి. ఫైల్స్ ఏమైనా ఉన్నాయా?" "మీ టేబుల్ మీద నిన్న సాయంత్రం పెట్టేశాం, మాడం!" "ఇవి సరే. ఇంకా?" "మీరు పెర్మిషన్ ఇస్తే..... '' "ఇస్తే? ఇస్తే ఏమిటి?", "ప... ప..... పామును..." "నా పెర్మిషన్‌తోనే వచ్చిందా ఆ పాము? చచ్చు సందేహాలూ, చవట ప్రశ్నలూ పొద్దునే....' చివర్లో ఆగొణుగుడు కూడా, దాసు పాము చెవులకు వినిపించిందికాని, కుర్చీలోకి తన పాదాలు ఆమె లాక్కొని కూర్చొని ఉన్న దృశ్యం మాత్రం కనిపించలేదు" గోడతోనో, స్తంభంతోనో చెబుతున్నట్టు ఆ ఆఫీసర్ మాట్లాడటం అందరికి అలవాటయిపోయింది. కాని పాము చెట్టు దిగి తీరా ఆఫీసులోకి జొరబడితే? ఈ ప్రశ్న తన నోటిలో నుంచి బయటికి రాకుండానే, సదరు సూపర్ గారు మరో సారి చవటల జాబితాలోకి ఎక్కిపోయినట్టు దాసు గ్రహించాడు. వెంటనే తన సీటుకు ఉరికి, కొత్త ఫైలు తయారు చేసి, స్పెషల్ నెంబరుతో పామును చంపించడానికి అక్షరాల ఇరువది రూపాయలు మాత్రం మంజూరు చేయించమని అచ్చ తెనుగులో దాసు రాసి, చిటికలో సూపర్ టేబులు మీద పెట్టేశాడు. మాట పెగలక, మరో గుక్కెడు మంచినీళ్లు తాగుదామని సూపర్ బయటికి వచ్చి, టేబులు మీద ఫైలును, టేబుల్ పక్కనే నిలబడి ఉన్న దాసును చూశాడు.

చత్వారం అద్దాలలోంచి ఫైలును సూపర్ చదువుతుంటే, దాసు "ఇంత వయస్సు వచ్చాక కూడా మీరు అంతంత చెమటలు తుడుచుకువలసిందేనా సార్?" అన్నాడు జాలి ఒలకపోస్తూ. అది వినబడనట్లు సూపర్ "అబ్బబ్బ, దాసూ! ఇట్లా రాస్తే ఎట్లాగయ్యా? ఏ రూల్ కింద డబ్బు ఇవ్వవచ్చో, ఏ హెడ్ కింద ఇవ్వాలో రాయనిదే ఎవరు మంజూరు చేస్తారు?" అంటూ ఉరిమాడు సూపర్. కుర్చీలో వెనక్కు జార్లపడి తల వెనక్కు వంచి కూర్చుని క్షణం కళ్లు పూర్తిగా మూసిన సూపరింటెండెంట్ పరిస్థితిని కొంచెం దూరం నుంచి ప్రభాకర్ గ్రహించాడు. టేబుల్ దగ్గరకు వచ్చి, "దాసూ, అర్జంటుగా మన సూపర్ గారికి కాస్త గ్లూకోజ్ కలిపి ఇచ్చెయ్" అన్నాడు. ఆయన టేబుల్ మీద ఉన్న గ్లూకోజ్ పొట్లం, గ్లాసు, పెన్‌స్టాండ్ మీద ఉన్న చెంచా తీసి దాసుకు ఇస్తూ. ఆఫీసు వాతవరణం కలుషితమైనప్పుడు గ్లూకోజ్ తాగడం ఆ సూపరింటెండెంట్‌కు అలవాటు. అది అందరికీ పరిపాటి. "అది సరే, ప్రభాకర్! మన బాసిణి మాడం మీటింగుకు వెళ్తే... ఇంక అటునుంచి అటే; చెట్టుమీద పాము ఇటే."

"అందుకని?"

సూరమ్మ నీళ్లు తెచ్చింది తక్షణం.

గ్లూకోజ్ నీళ్లు చప్పరించేటప్పటికి సూపర్‌కు నీరసం కాస్త తగ్గింది. "మన ఎ.ఒ. గారికి ఫోన్‌చేసి చెప్పాను. మంత్రగాడి కోసం మనిషిని పంపిస్తానన్నారు. కాని నోటు పంపించమన్నారు" అన్నాడు సూపర్, నెమ్మదిగా తన పొట్టి మెడను పొడుగ్గా సాగదీసుకోవడానికి ప్రయత్నిస్తూ.

"నాకు తెలుసు సారూ! మీ మతలబులు. అందుకని ముందే రాసి పెట్టేశా."

దాసు ఆ మాట పూర్తిగా చెప్పకుండానే మళ్లీ బెల్! సూపర్ వెంటనే ఆ ఫైలు తీసుకుని ఆఫీసరమ్మ రూంలోకి వెళ్లాడు.

"నేను మీటింగుకు వెళ్లాలి అని చెప్పానుగా. ఆ ఫైల్ ఏది?"

"మీకు నిన్న సాయంత్రమే పంపించా, మాడం."

"ఇన్ని ఫైల్స్‌లో అదెక్కడో కనబడదేం?"

"నేను తీ...తీసిస్తా మాడం! ఈలోగా ఈ పాము ఫైలు..." అని సూపర్ కొంచెం వంగి ఆమె ముందు ఫైలు పెట్టాడు. వెంటనే పక్కకు తిరిగి బల్లమీద ఫైళ్లకేసి చూశాడు, గొర్రెలకాపరి గొర్రెలకేసి చూసినట్టు. మీటింగ్ ఫైల్‌ను ఇట్టే లాగి అది కూడా ఆమె ముందు పెట్టాడు సూపర్. అది చేత్తో తీసుకుని సీటులోంచి లేచి నుంచుని, "ఇంకేమి పనిలేనట్టు పాముల ఫైళ్లు, తేళ్ల ఫైళ్లు రాస్తూ కూచుంటారు. ఏది అర్జంటో తెలియకపోతే ఇంకేమిటి చచ్చేది?" అని సణుక్కుని తన హ్యాండ్ బ్యాగ్ కూడా తీసుకుంది.

"ఆ పాము ధర్మమా అని ఎవరెవరికి చావు మూడిందో!" అనుకున్నాడు ప్రభాకర్ మనస్సులో. ఆఫీసర్ వెళ్లిపోయింది బయటకు. వెనకనే పాము ఫైలు తీసుకుని సూపర్ వచ్చాడు. పామును తానే తన చేతులతో బుట్టలో పెట్టేసినంత సంతోషంతో. చివర నిముషంలో ఫైలుమీద ఆఫీసరు సంతకం పెట్టింది.

"ఎంత ఘనకార్యం సాధించారో మన సూపర్‌గారు!" అని దాసు ఆయన చేయి పట్టుకుని అభినందన షేక్‌లు ఇస్తుంటే, ప్రభాకర్‌కు నవ్వు ఆగలేదు. కాని అంతలోనే తిరిగి సీరియస్ అయిపోయాడు. చెట్టుమీద పొడుగ్గా పడుకున్ని నాలుక ఆడిస్తున్న ఆ నాగుపాము జ్ఞాపకం వచ్చి. "ఈ ఫైలు ఎ.ఒ. గారికి అర్జంటుగా పంపించాలి, దాసూ!" అంటూ ఒక కాలు కుర్చీలో పెట్టుకుని కుర్చీలో కూచున్నాడు సూపరింటెండెంట్ వెనక్కు జార్లపడి.

ఒక్క క్షణం ఆగి తళుక్కుమన్న కళ్లతో దాసు "అటెండరు ఇంకా రాలేదు. నేను వెళ్లాలెండి పెద్దాఫీసుకు" అనగానే ప్రభాకర్ "నేనూ రెడీయే సూపర్‌గారూ!" అన్నాడు. సూపర్ ఇద్దరికేసి అటూ ఇటూ ఒక్కసారి చూసి, "ఓహో! ఇదా సంగతి! అమ్మ దొంగల్లారా! నాగుపామును చెట్టుమీద వదిలేసి మీరిద్దరు పారిపోదామని అనుకుంటున్నారా యేం? అదేం కుదరదు. నేను మాత్రం వెళ్లలేనా, ఏం?" అని సూపర్ ప్రశ్న ఒకటి ఎదురురాగానే ఇద్దరూ నవ్వేశారు.

సూరమ్మ, "చిన్నమ్మగారు వచ్చె!" అని ప్రకటించింది. "ఇప్పుడా టైపిస్టు రావడం? నాగుపాము రావడం, పెద్దమ్మగారు వచ్చి వెళ్లిపోవడం, అన్నీ అయ్యాకా?" అని ప్రభాకర్ వ్యాఖ్యానించాడు. "పోనిద్దూ. పెద్దమ్మ అయితే వెళ్లిపోయిందికాని నాగుపాము అక్కడే ఉందిగా!" అని దాసు మెలికతిప్పాడు. "ఊరుకోవయ్యా, గొడవ. అమ్మా, సుబ్బలక్ష్మి తల్లీ! మన జామచెట్టు మీద సుబ్బారాయుడు మకాం పెట్టాడు, జాగ్రత్త!" అని హెచ్చరించాడు సూపరెంటు. "లేటుహాజరు పట్టీలో సంతకం పెట్టబోతూఉన్న టైపిస్టు సంతకం పెట్టడం మానివేసి, మిడిగుడ్లు పెట్టి సూపరెంటు చూస్తూ నిటారుగా నిలబడిపోయింది. ఆయన మాటలు అర్థంకాలేదామెకు. ఆయన వెంటనే, "సూరమ్మా! సుబ్బలక్ష్మికి తాజా మంచినీళ్లు!" అని కేకవేసి, సీటు లోంచి లేచాడు, పాము ఫైలు తీసుకొని.

ఆ నీళ్లు తాగి, గ్లాసును సూరమ్మకి బైపిస్టు అందివ్వగానే, సూరమ్మ, "ఏంలేదు చిన్నమ్మా! నా బారంత నాగుపాము ఒకటి ఆ జామచెట్టు మీద..." అని నవ్వుతూ వేలుతో చూపిస్తుంటే, ప్రభాకర్ "నేను చూపిస్తాలే, సూరమ్మా!" అని ఒక అడుగు అటు వేసి ఆగిపోయాడు, చటుక్కున. దాసు పకాలున నవ్వాడు. "ప్రభాకర్ వల్ల కాదుకాని, నేను చూపిస్తా!" అంటూ తాను ముందుకు నడచాడు దాసు, ధైర్యాన్ని అంతా చిక్కపట్టుకొని. "నిజంగానేనా? అయితే ఈవేళ నేను లేటుకాదు. లీవ్!" అంటూ బైపిస్టు జరజరా పాముపిల్లలా బయటకు వెళ్లిపోయింది. నీవు దరఖాస్తు అయినా ఇవ్వకుండా సూరమ్మ అటు ప్రభాకర్ కేసి, ఇటు దానుకేసి చూసి, "మిమ్మల్ని ఇద్దరిని పిచ్చోళ్లను చేసి, చిన్నమ్మ తుర్రుమంది చూశారా?" అని విరగబడి నవ్వేసింది.

"ఉష్. ఒకపక్క ఆ నాగుపాము, దానిరంగు, నాలుకలు గుర్తుకు రాగానే వణుకు పుట్టుకువస్తుంటే, సూరమ్మా నువ్వు నవ్వడం..." అని దాను ఏదో అందామనుకున్నాడు.

"ఎందుకయ్యా అంతభయం? రండి, నా వెనకాలే!" అని సూరమ్మ పామువైపు నడచింది, మల్లెపొదవైపు నడుస్తున్నట్టు. చేతిలో ఏమీలేదు. "కర్ర అయినా లేకుండా ఏమిటాధైర్యం, సూరమ్మ!" అంటూ ప్రభాకర్ అటూ ఇటూ చూశాడు. చీపురుకట్ట తప్ప, కర్ర ఎక్కడనుంచి వస్తుంది ఆఫీసులో? ఎప్రూఫ్ ఫర్నిచర్‌లో కర్రలు, కట్టెలు లేవాయె. సూరమ్మ జామచెట్టు వైపు వరండాలో నడుస్తోంది నిబ్బరంగా, ఆ చెట్టు రెమ్మలకేసి చూస్తూ, కాయలకోసం వెదుకుతున్నట్టు. ఆమెకు కాస్తదూరంగా అడుగులో అడుగు వేసుకుంటూ చెట్టు కొమ్మకేసి చూస్తూ వస్తున్న దానును, ఆ వెనకనేవస్తున్న ప్రభాకర్ గబుక్కున పట్టుకున్నాడు భుజంమీద. "దానూ! పాము! పాము చెట్టుమీద లేదు!" అని అరచాడు ఒక్కసారి. "అరె, ఏమైంది?" దాస్ ఆగిపోయాడు. సూరమ్మ కూడా ఆగిపోయింది. "అవును సారూ! ఎటుపోయింది? దాని జిమ్మడ!" అని అటూ ఇటూ చూడటం మొదలుపెట్టింది. ఎక్కడా పాము కనిపించలేదు.

"జామచెట్టు దిగి అది ఎటుపోయిందో ఏమో!" అన్నాడు ప్రభాకర్. "టాయిలెట్‌లోకి వెళ్లిందేమో?" అని దాస్ అనుమానం, "పాముకు టాయ్‌లెట్‌తో ఏంపని? పక్క కిటికీలోంచి మన బాసిణీ రూంలోకి వెళ్లిందేమో!" అన్నాడు ప్రభాకర్. "అయితే నడు, సారూ! చూద్దాం!" అంటూ సూరమ్మ ముందుకు నడిచింది ఆఫీసరు గదిలోకి. "నేనుమాత్రం రానంటే, నేననలే రాను", అని దాను, ప్రభాకర్ వెనక్కి తగ్గారు. "అంత భయమైతే ఎట్లాగయ్యా, మగవాళ్లు కాదూ?" అని సూరమ్మ హేళన చేసింది. "మేమా?" అని ప్రభాకర్ ఎదురు అడిగేటప్పటికి, దానూ, సూరమ్మ, నవ్వు ఆపుకోలేకపోయారు: అంతలోనే "మరి, పాము ఏమైనట్టు?" అని దాను ప్రశ్న.

"ఆఫీసులోకే వచ్చేసి, ఏ మూలో చుట్టపెట్టుకొని కూచొని ఉంటుంది" అంది సూరమ్మ. "కాదుకాదు. ఆఫీసరుగారి గదిలోనే ఉండి ఉంటుంది, అదే దానికి తగినచోటు సూరమ్మా! మన దగ్గరకాదు" అన్నాడు ప్రభాకర్.



డాక్టరు రోగితో : చూడు! వ్యాధి బాగా ముదిరిపోయింది. ఇంక కేవలం గంట కన్నా ఎక్కువ బ్రతకలేవు. చివరిసారిగా ఎవరినైనా చూడాలనుకుంటే చెవ్పు పిలిపిస్తాను.

రోగి : త్వరగా మరొక మంచి డాక్టరును పిలిపించండి.

డాక్టరు : ఆ!

వల్లాల సుషమ,[బలపాల]

**ఇంతలో ఫోన్ మోగింది. ఒక్క ఎగురున దాను తీశాడు ఆత్రంగా, "హల్లో" అనగానే, అవతలనుంచి** "దానూ, నువ్వు రాసిన నోటు సరిగా లేదన్నారు ఎ.ఒ.గారు. తెప్పి ఇచ్చివేశారు. ఏమిటా నోటు రాయడం? ఎంత ట్రైనింగ్ ఇస్తేనేం? ఏం లాభం? పామును అక్కడే ఉండనీయండి. నేను నోటు మళ్లీ సరిచేసి ఇస్తున్నా. మంత్రగాడు ఎటో వెళ్లాడట. అంచేత సన్నవలవేసి పామును ఇట్టే పట్టేసే జాలీవాణ్ణి తీసుకువస్తున్నా" అంటూ సూపర్ చెబుతుంటే, "నర్, సార్! వ... పా.ము" అని దాను వాక్యం పూర్తికాకుండానే ఫోన్ కట్ అయిపోయింది. ఎంత మొత్తుకున్నా, మళ్లీ ఫోన్ కలిస్తేగా "నేను ట్రై చేస్తా ఇటియ్యి!" అని ప్రభాకర్ తీసుకున్నాడు. మొరాయించిన ఫోన్ చేత మాట్లాడించడం ప్రభాకరం తరం కూడా కాలేదు..

అప్పటికి సూపర్, ఆయన వెంట ఒక మీసాల పెద్దమనిషి వచ్చారు. ఆ బుర్ర మీసాలు, ఎర్ర తలపాగా, గ్లాస్కోలాల్చి, ఎడమ చేతిలో జిప్‌బాగ్, కుడిచేతిలో పొన్నుకర్ర చూడగానే, ఆ నల్లటి పెద్దమనిషే మన ఆర్తత్రాణపరాయణుడని, దాను, ప్రభాకర్ గ్రహించారు. వస్తూనే సూపర్, "ప్రభాకర్! ఇప్పుడు నాగుపామును చూపిస్తావో, త్రాచుపామును చూపిస్తావో చూపించు. ఈయన దాన్ని ఇట్టే అంటే ఇట్టే- తన జిప్ బ్యాగ్‌లో పెట్టుకొని తీసుకుపోతారు" అన్నాడు తెచ్చుపెట్టుకున్న ధైర్యంతో. వరండావైపు నడుస్తూ; చేతితో ప్రభాకర్‌ను, దాస్‌ను తనతో రమ్మని చేయి ఊపాడు కూడా.

దాను "కాని, నర్, నర్" అని నసిగాడు. అతని తల దురద ఎక్కింది కాబోలు, ఎడమచేతివేళ్లు తన గుబురు జుట్టు గూటిలోకి వెళ్లి, దేనికోసమో వెతకడం మొదలుపెట్టాయి. సూరమ్మ, "ఆగయ్యా, ఆగు. సూపరెంటుసారూ అనలు పాము అక్కడ ఉంటేగందా?" అంది. "అంటే?" సూపర్ స్పీడు హఠాత్తుగా ఎప్పుడుపోయిందో ఆ పాము, ఎవరికెరుక?" అంది సూరమ్మ, తీక్షణంగా ఆ చెట్టుమీదకి మరోసారి దృష్టి సారించి, "అయితే, మీరంతా ఏం చేస్తున్నట్టు?" రెట్టించాడు సూపర్. "మేం అక్కడ ఉంటేగా! బాబోయ్!" అనే ప్రభాకర్ చేతులు గుండెల మీదికిపోయాయి.

ఇంతలో పాములాయన ఎడమ చేతి మణికట్టు మీద లాల్చి కాస్త పైకి తోసి, తన క్వార్జ్ వాచీ చూసి, "జల్దీ! పాము ఎక్కడ?" అని గర్జించాడు. దాను ఉలిక్కిపట్టాడు. వల ఏది ఇంతకీ? పోనీ వలనైనా చూద్దాం అనుకొన్న ప్రభాకర్ కంఠం బిగుసుకుపోయింది. "పోయిందిలే ఎటో!" అంటూ సూరమ్మ చేయి తిప్పేసింది. "నేనూ పోతున్నా. బువ్వ తినేవేళ అయింది" అని సూపర్‌కేసి చూసి క్షణంలో రివ్వుమంది.

సూపరెంటుకు ఏమి చేయాలో తోచలేదు. "ఈసారి పాము కనిపిస్తే తప్పకుండా నిన్నే పిలుస్తాం కాని..." "ఎప్పటి రేటు అప్పుడే. ఏదీ పాము? పైనల్ ఇచ్చెయ్ జల్దీ" హుంకరించాడు మీసాలయ్య. "పాములేనిదే, పామును పట్టుకోనిదే, పైనలు ఏమిటయ్యా?" సూపర్ ప్రశ్న. "ఓహో! గైతే పోలీసుల్ని పిల్వమంటావా? నా జిప్ బ్యాగ్‌లోంచి మరో పాము పిల్లను తీసి నీ మేజా మీద విడిచిపెట్టమంటావా?" అంటూ మీసాలయ్య జిప్ బ్యాగ్‌పైకి తీశాడు.

"మా సూపర్ టేబుల్ మీద కాదు. మా ఆఫీసరు కుషన్ కుర్చీ ఖాళీగా ఉంది; మెత్తగా ఉంటుంది బుజ్జి బుజ్జి పాము పిల్లలకి!" అని అందామనుకున్నాడు దాను. కాని మాట నోటిలోంచి ఊడిపడి ఛస్తేగా! చివరికి, "ఊ, ఊ" అని రెండుసార్లు ఊకొట్టి మరీ ఊరుకున్నాడు.

సూపర్ "అదంతా ఎందుకయ్యా బాబూ! నీకు కావలసింది పైనలేగా. ఇదిగో ఏభై నోటు. ప్రభాకర్! వోచర్ ఫారాలు ఎక్కడ ఉన్నాయో చూడు" అని దూరంగా ఉన్న బైపిస్టు స్టూలు మీద తాను చతికిలపడ్డాడు. ముఖం మీద చెమటలు తుడుచుకోవడానికి తన జేబురుమాలు చాలక చిన్నమ్మ టవలు తీసుకోకతప్పలేదు. అది చూసేటప్పటికి దానుకు నవ్వు రాబోయి ఆగిపోయింది. ప్రభాకర్ గ్లానుడు నీళ్లు కూజాలోంచి వంచి అందించాడు సూపర్‌కు జాలిగా. "రెవెన్యూ స్టాంప్ లేదు, సార్" అని దాను వెంటనే టెక్నికల్ అభ్యంతరం లేవనెత్తాడు మెత్తగా.

"అబ్బబ్బ! అభ్యంతరాలూ, అబ్జక్షనులు ముందు పుట్టి, మనమంతా తర్వాత పుట్టామని నాకు తెలుసులేవయ్యా, రేపు ఆ స్టాంప్ నేనే వేసి, క్రాస్ చేసి అఘోరిస్తాగాని, ముందు ఆయనను పంపించివేసెయ్!" అని దాను మీద ఉరిమాడు సూపరెంటెండెంట్. ప్రభాకర్ వోచరు ఫారాలు అందించాడు. సూపర్ చెప్పినట్లు తక్షణం చేసినా, ఈ వోచర్ ఎప్పటికైనా పాస్ అవుతుందా, లేకపోతే ఈ ఏభై రూపాయలూ సూపర్‌గారి చేతికి తగులుతాయా అనే అనుమానం దాస్ మనస్సును పీకుతూనే ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులంటే అన్నీ శాస్త్ర ప్రకారమే జరగాలాయే!

సన్నవల ఆయన వెళ్లిపోయాడు, లాల్చి పక్క జేబులో డబ్బును, మీసాల లోలోపల చిరునవ్వును నులువుగా దాచుకుంటూ.

నాగుపాము జాడ లేదు. అది ఆఫీసు పొలిమేరల లోనే పొంచి ఉండి అందరికేసి చూసి నవ్వుతున్నట్టే ప్రభాకర్‌కి అనిపిస్తూ ఉంటుంది.

ఎప్పటిలాగే స్వీపర్ సూరమ్మ చీపురు మాత్రం ఆఫీను మూలమూలలకు ప్రతిరోజూ వెళ్లివస్తోంది నిర్భయంగా!